క్లుప్తంగా

మణిపూర్ ఘటనలకు నిరసనగా విద్యార్థుల ర్యాలీ



జగ్గయ్యపేట అర్బన్: మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణ సంఘటనలకు నిరసనగా సేవ్ మణిపూర్, సేవ్ ఇండియా పేరుతో జగ్గయ్యపేట పట్టణంలో శనివారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలి నుంచి మొదలైన ర్యాలీలో విద్యార్థులు, మహిళలు బ్యానర్లు, ప్ల కార్డులు చేత బూని మణిపూర్‌లో జరిగిన సంఘటనకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఐద్వా జిల్లా నాయకురాలు సోమోజు నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు, రాజు భరత్, ప్రత్యూష, ప్రదీప్, వంశీ, ఐద్వా నాయకులు దంతాల రాజేశ్వరి, సరస్వతి,నాగరాణి, నాగలక్ష్మి, బూషమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిటాలలో ఉర్దూ పాఠశాల పునఃప్రారంభం



కంచికచర్ల: మండలంలోని పరిటాలలో మూతపడిన ఉర్దూ పాఠశాలను గ్రామస్తుల సహకారంతో అధికారులు శనివారం తిరిగి ప్రారంభించారు. గతంలో ఉర్దూ పాఠశాలను మండల పరిషత్ స్కూల్‌లో విలీనం చేశారు. దీంతో ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. అయితే గ్రామంలో ఎక్కువగా ముస్లిం కుటుంబాలు ఉండటంతో ఇతర ప్రాంతాల్లో చదువుకునేందుకు తమ పిల్లలు వెళ్లరని గ్రామస్తులు విద్యాశాఖ అధికారికి తెలియజేశారు. స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక ఒక ఉపాధ్యాయురాలిని నియమించారు. పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరేలా చొరవ చూపాలని గ్రామస్తులతో అన్నారు. దీంతో మూతపడిన ఉర్దూ పాఠశాల తిరిగి ప్రారంభమవటంతో ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు



వత్సవాయి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో వరినాట్లను ముమ్మరంగా వేస్తున్నారు. కాలువ, మునేటి కింద ఉన్న మాగాణి పొలాలను ట్రాక్టర్లతో దమ్ము చేస్తున్నారు. వరి నారు కూడా సిద్ధంగా ఉండడంతో పొలాలు సన్నద్ధం చేసిన రైతులు వెంటనే నాట్లు వేస్తున్నారు. వాతావరణం నాట్లకు అనుకూలంగా ఉండడంతో రైతులు వేరే ప్రాంతాల నుంచి నారును తీసుకువచ్చి నాట్లు వేస్తున్నారు. మునేటికి కింద ఉన్న మాగాణి భూముల్లో ఎక్కువగా నాట్లు పడుతున్నాయి.

కుట్టు శిక్షణ ముగింపు



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఉచిత సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం అన్నారు. ఖమ్మంకు చెందిన మాతృశ్రీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎస్‌కే రజియా, సూపర్‌వైజర్ కరివేద త్రివేణి, శిక్షకురాలు మార్కపూడి తిరుపతమ్మ పాల్గొన్నారు.

1.2 కేజీల గంజాయి స్వాధీనం
ఆరుగురు యువకుల అరెస్ట్

నందిగామ: గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హనీష్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో స్థానిక గాంధీ నగర్ ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న గోపి అనే యువకుడితో పాటు మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్ఐలు పండు దొర, సోమేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



నందిగామ: డ్వాక్రా గ్రూపుల మహిళలు పొందిన రుణాల ద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన ఏడు గ్రూపుల డ్వాక్రా మహిళలకు మంజూరైన రూ.93 లక్షల రుణాలను శనివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మునేరు వరదతో మేట వేసిన మాగాణి పొలాలు

- 50 ఎకరాల్లో ఇసుక మేట
- తువ్వ కాలువకు 36 చోట్ల గండ్లు
- 150 ఎకరాల్లో నాట్లు, నారుమళ్లు మునక
- అంచనాల తయారీలో అధికారులు



గుమ్మడిదూర్రు వద్ద మేట వేసిన వరి నాటిన పొలాలు

పెనుగంచిప్రోలు: ఎగువన భారీగా కురిసిన వర్షాలతో గత నెల 27,28 తేదీల్లో వచ్చిన వరద ఉధృతికి మునేరు పక్కన తువ్వ కాలువకు 36 చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో ఆయకట్టున ఉన్న మాగాణి పొలాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. తువ్వ కాలువ కింద వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు నుంచి పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదూర్రు వరకు 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. వరద నీటికి అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు గ్రామాల మధ్య వరి పొలాలు దారుణంగా మారాయి. 50 ఎకరాల్లో పూర్తిగా ఇసుక మేట వేయటంతో పాటు సుమారుగా 150 ఎకరాల్లో నాట్లు, నారుమళ్లు పూర్తిగా నీట మునిగి ఎండిపోయాయి. వరద సంభవించిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులతో కాలువ మొత్తం పరిశీలించి ఉన్నతాధికారులతో సమీక్షించారు. వరద వలన దెబ్బతిన్న పంట పొలాలను, దెబ్బతిన్న గండ్లను పరిశీలించారు. రైతులకు కలిగిన నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గండ్లు పూడ్చివేతకు రూ.3 కోట్లు అంచనా

తువ్వ కాలువకు 36 చోట్ల పెద్ద, చిన్న గండ్లు పడ్డాయి. గండ్లు పూడ్చకపోతే ప్రభావిత ప్రాంతాల్లో రైతులు సాగు చేయలేని పరిస్థితి. గండ్లు పడిన చోట పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నేటికీ అక్కడ నీరు లోతుగా ఉంది. పలు చోట్ల తూములు, మోరీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇరిగేషన్ అధికారులు గండ్లు పూడ్చేందుకు, మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేశారు. సుమారుగా వీటికి రూ.3కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు.

దారుణంగా దెబ్బతిన్న విద్యుత్ సౌకర్యం

వరద తీవ్రతకు పొలాల్లో విద్యుత్ సౌకర్యం బాగా దెబ్బతింది. ట్రాన్స్‌ఫార్మర్లు 14 పూర్తిగా దెబ్బతినగా, 9.1 మీటర్ల విద్యుత్ స్తంభాలు 29, 8 మీటర్ల విద్యుత్ స్తంభాలు 20, విద్యుత్ తీగ కిలోమీటరు మేర కొట్టుకుపోయినట్టు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తం ఆయకట్టున 392 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండగా యుద్ధప్రాతిపదికన అన్నిటినీ సిద్ధం చేశామని, కేవలం 15 ట్రాన్స్‌ఫార్మర్‌ల పరిధిలో మాత్రమే విద్యుత్ సౌకర్యం లేదన్నారు. దెబ్బతిన్న చోట సుమారుగా రూ.30 లక్షలతో మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేశామన్నారు.

ఎకరంన్నర పొలంలో మేట వేసింది



మునేరు వరదకు తువ్వకాలువకు గండి పడి ఎకరంన్నర పొలంలో ఇసుక మేట వేసింది. మేట తీసుకోవాలంటే చాలా ఖర్చు అవుతుంది. నారు వేసిన పొలాలకు ఎకరానికి రూ.10 నుంచి రూ.15 వేలు ఖర్చు అయింది.

–బి.ఏసురత్నం, రైతు, గుమ్మడిదూర్రు

అంచనాలు సిద్ధం



తువ్వకాలువ గండ్లు పూడ్చటం, కాలువ మరమ్మతులకు సుమారుగా రూ.3 కోట్లతో అంచనాలు రూపొందించాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

–ఎస్.రామకృష్ణారావు, ఇరిగేషన్ శాఖ డీఈ

పేదల సంక్షేమమే జగనన్న ఆకాంక్ష

ప్రభుత్వ విప్ ఉదయభాను



డాంగేనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. శనివారం ఉదయం స్థానిక 1 వ సచివాలయం పరిధిలోని 2 వ వార్డు, సాయంత్రం 6 వ వార్డులోని కాకానినగర్, డాంగే నగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజలకు సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తూ ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లో వోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని డాంగే నగర్ వాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా, విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి నెలాఖరు లోగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలిచి రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, శ్రీనివాసగౌడ్, కౌన్సిలర్ కొలగాని రాము, వార్డు ముఖ్య నాయకులు చేని శ్రీనివాసరావు, దంతాల శ్రీను, యూత్ నాయకులు గింజుపల్లి గోపి, పాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళను బెదిరించిన ఘటనపై కేసు నమోదు

నందిగామ: మండలంలోని కంచల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మహిళ చెయ్యి పట్టుకోవడంతో పాటు బెదిరించిన ఘటనపై నందిగామ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదయింది. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం కంచల గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి అతని ఇంటి సమీపంలోనే ఉంటున్న ఓ మహిళ ఇంట్లోకి వెళ్లి ఒంటరిగా ఉన్న మహిళ చెయ్యి పట్టుకోవడంతో పాటు చంపుతానని బెదిరించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిపాలతోనే పిల్లలకు రోగ నిరోధక శక్తి

కొణకంచి(పెనుగంచిప్రోలు): తల్లి పాలతోనే పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి కె.వాణి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శనివారం ఆయుష్ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించటంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల పాటు పిల్లలకు పాలు ఇవ్వటం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్ట పెంచేలా పని చేయాలి

వీరులపాడు: పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగించటంతో పాటు న్యాయానికి కట్టుబడి ప్రతిష్టను పెంపొందించేలా పని చేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. వీరులపాడు పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ సేవలను విస్తృతం చేయాలన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీసీపీ అజిత, ఏసీపీ జనార్దన్ నాయుడు, నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, ఎస్ఐ మహాలక్ష్మణుడు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గోల్డ్ మానిటైజేషన్ స్కీంకు అమ్మవారి బంగారం



అమ్మవారి బంగారు నగలను ఎస్‌బీఐ అధికారులకు అప్పగిస్తున్న ఆలయ ఈఓ, ఆర్‌జేసీ, చైర్మన్

పెనుగంచిప్రోలు: గోల్డ్ మానిటైజేషన్ స్కీం కింద ఇన్వెస్ట్ చేయటానికి సంబంధించి శనివారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి సంబంధించిన బంగారు ఆభరణాలను విజయవాడ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు మాట్లాడుతూ అమ్మవారికి ఇప్పటివరకు భక్తుల కానుకల రూపంలో 7 కిలోల 700 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయన్నారు. అమ్మవారి అలంకరణకు వాడే ఆభరణాలను అలాగే ఉంచి బ్యాంక్ లాకర్‌లో ఉన్న ఆభరణాలను మాత్రమే కరిగించేందుకు ఇచ్చామన్నారు. మొత్తం 12 లాకర్లలో అమ్మవారి నగలు ఉండగా వాటికి సంబంధించి బ్యాంక్‌కు అద్దె చెల్లించటంతో పాటు ఇన్సూరెన్స్ చెల్లిస్తున్నామన్నారు. ఇప్పుడు ఒక్క లాకర్ మాత్రమే ఉంచి మిగిలిన లాకర్లలో బంగారు నగలను కరిగించి గోల్డ్ బాండ్లు తీసుకోవటం ద్వారా ఆలయానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఆర్‌జేసీ ఎంవీ సురేష్‌బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి దుర్గాభవాని, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను విధిగా చెల్లించాలి



కంచికచర్ల రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

కంచికచర్ల: గత నెలలో ఆదాయ పన్ను రిటర్ను దఖలు చేయని విశ్రాంత ఉద్యోగులు వచ్చే డిసెంబర్ 31లోగా పెనాల్టీతో చెల్లించవచ్చని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సంఘ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. అనంతరం సంఘ కార్యాలయంలో విజయవాడ స్టార్ ఆసుపత్రి వైద్యులు శిబిరం నిర్వహించి కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ అబ్దుల్ సత్తార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, బొజ్జా మల్లికార్జునరావు, చాపలమడుగు స్వర్ణలత, నాగేశ్వరరావు, బీవీ సర్వేశ్వరరావు, బి.కృష్ణమూర్తి, జానిమియా పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం జగన్ అవిరళ కృషి

ఎంపీపీ మలక్‌బషీర్



కంచికచర్ల మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని మండల పరిషత్ అధ్యక్షుడు షేక్ మలక్ బషీర్ అన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నుంచి రూ.2.5 కోట్ల నిధులతో అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, బోరు పంపులు వేయించామన్నారు. ఎంఈఓ బి.బాలాజీ మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా రూ.3.5 కోట్ల నిధులతో పాఠశాలల రూపురేఖలు మార్చామన్నారు. ఏఓ కె.విజయకుమార్ మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిప్రియ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు నిత్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. తహసీల్దార్ శంకరబాబు మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డు అవసరమైన వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని కార్డును పొందాలన్నారు. కంచికచర్ల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బీపీ, సుగర్, రక్త పరీక్ష, కిడ్నీలకు సంబంధించిన పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన పరికరాలను అందజేసిందని, పరీక్షలు కావాల్సిన వారు ఉచితంగా చేయించుకోవాలని సూచించారు. విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న కాలనీలలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. తనకు తెలియకుండా తన పరిధిలోని సెగ్మెంట్‌లో సీసీ రోడ్లు వేసి, తనను అవమానించారని అంటూ ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఇక నుంచి అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని తహసీల్దార్ శంకరబాబు సమాధానమివ్వడంతో పైకి లేచి కుర్చీలో కూర్చున్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏపీఎం కోట భాస్కరరావు, ఉద్యాన శాఖ అధికారి నీలిమ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అల్లూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ, ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వాలకు భిన్నంగా పాలన సాగిస్తూ ప్రజల ప్రతి కష్టంలోను అండగా ఉంటూ ప్రజలందరి నమ్మకంగా నిలిచారన్నారు. ముఖ్యంగా 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు అందించటంతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేసి దశాబ్దాల కాలం నాటి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేశారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. రాష్ట్ర క్యాబినెట్‌లో సైతం బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు. మంచి చేయాలనే సమున్నత లక్ష్యంతో పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజా సంక్షేమ పాలనకు కొనసాగింపునివ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వైస్ ఎంపీపీ ఆదాం, సర్పంచ్ బందెల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు మోంద్రు బాయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు వెంకట్ మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్సీ అరుణకుమార్



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కత్తి వెంకట్ (55) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం అలసటగా ఉండటంతో నందిగామ ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేయించుకుని వెళ్లారు. ఈ క్రమంలో గుండెపోటు రావటంతో ఒక్కసారిగా కుప్పకూలారు. చుట్టుపక్కల వారు గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని హోంగార్డు నివాసానికి తరలించి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మృతుని కుమారుడు కత్తి వికాస్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసమే రాజన్న ఉచిత భోజనం

ప్రభుత్వ విప్ ఉదయభాను



భోజనాలను వడ్డిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో నిరుపేదలు, నిరాశ్రయులు, అభాగ్యుల కోసం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద నిరంతరం కొనసాగే విధంగా రాజన్న ఉచిత భోజనం కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. శనివారం సుమారు 600 మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, నాయకులు పాటి సాంబ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా వెంచర్లు వేయొద్దు

మున్సిపల్ కమిషనర్ జయరాం



రామన్నపేట రోడ్డులో వెంచర్‌ను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

నందిగామ: అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. పట్టణంలోని రామన్నపేట రహదారిలో నెహ్రూనగర్ సమీపంలో అనుమతులు లేకుండా ఇటీవల ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని శనివారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఝాన్సీ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. వెంచర్‌లో వేసిన రాళ్లు తొలగించడంతోపాటు క్రేన్ల ద్వారా వెంచర్ లోని రహదారులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా వేసిన వెంచర్లలో స్థలాలు ఎవరూ కొనవద్దన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే అనుమతులు లేని వెంచర్లను ముందుగానే తొలగిస్తున్నామని తెలిపారు.

పేటలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా



పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

జగ్గయ్యపేటఅర్బన్: పారిశ్రామిక వాడగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న జగ్గయ్యపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో ఏర్పాటుతో పాటు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్థానిక కోదాడ రోడ్‌లోని పాత ఎస్ఎస్‌పీ క్వార్టర్స్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ త్వరలో స్థలం ఏర్పాటుచేసి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవన నిర్మాణానికి కృషిచేస్తామని చెప్పారు. ట్రాఫిక్ ఎస్ఐగా నియమితులైన శ్రీనివాసరావును కమిషనర్ రాణా స్టేషన్ ఎస్‌హెచ్‌వో చైర్‌లో కూర్చోబెట్టారు. డీసీపీ వి.అనిత, ట్రాఫిక్ డీసీపీ ప్రసాద్, నందిగామ ఏసీపీ జనార్దననాయుడు, సీఐ జానకీరామ్, ఎస్ఐలు రామారావు, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యంపై అవగాహన

గరికపాడు(జగ్గయ్యపేట): మండలంలోని గరికపాడు గ్రామంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో చిరుధాన్యాల ప్రాముఖ్యంపై శనివారం మహిళా రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకం వల్ల ప్రజలకు ఆరోగ్యం మెరుగ్గా ఉండటంతో పాటు పలు రకాల వ్యాధులు కూడా దరి చేరవన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మీకళ, వెంకటరెడ్డి, శివప్రసాద్, రాజశేఖర్, జశ్వంత్ రెడ్డి, శంకరి, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.